బారులు తీరిన భారీ వాహనాలు

- రహదారులపై అనధికార పార్కింగ్
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి



కంచరపాలెం-జ్ఞానాపురం రహదారిలో భారీ వాహనాల రాంగ్ పార్కింగ్



మరమ్మతుల నిమిత్తం రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన భారీ లారీలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 కంచరపాలెం-జ్ఞానాపురం పరిధిలో భారీ వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారులపై అనధికార పార్కింగ్‌తో స్థానిక ప్రజలు, వాహన చోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గత రహదారులపై భారీ లారీలు, ట్రావెల్స్ బస్సులను పార్క్‌చేసి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇతర వాహన చోదకులు నరక యాతన పడుతున్నారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో భారీ వాహనాలను నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్డుకిరువైపులా రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నెలలు తరబడి రోడ్లపై వాహనాలను వదిలేయడంతో చెత్తాచెదారం, మట్టి గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఆ ప్రాంతంలో శుభ్రం చేయడం కష్టతరంగా మారడంతో పారిశుధ్య సిబ్బంది రోడ్లను ఊడ్చే పనులను వదులుకున్నారు.

ట్రాఫిక్ జామ్

కంచరపాలెం నుంచి జ్ఞానాపురం ఫ్లైఓవర్ వంతెన మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలను ఎక్కడపడితే అక్కడ పార్క్‌చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నా.. పట్టించుకునే వారు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి భారీ వాహనాల అనధికార పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

వాహనాలను తరలించాలి

జ్ఞానాపురం-కంచరపాలెం రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి నిలిపి ఉంచిన భారీ వాహనాలను తరలిస్తే ఆటుగా ప్రయాణించే వాహనాలకు ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలి.

– జయప్రకాష్, సెబాస్టియన్ కాలనీ

జోనల్ అధికారులు స్పందించాలి

జోన్-5 పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనాల పార్కింగ్, మరమ్మతులు చేపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి వాహనాల రాంగ్ పార్కింగ్‌ను అరికట్టాలి.

– పి.రవికుమార్, బాబూ కాలనీ

కొండవాలులో శిథిల గృహాలను గుర్తించండి



మాట్లాడుతున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితిని, శిథిల గృహాలను గుర్తించాలని సచివాలయ ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలను జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో జోన్-5 ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వివరాలు వెంటనే సేకరించాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ వెంకటరావు, టీపీవో విజయ్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- జీవీఎంసీ జోన్-5 కమిషనర్ కృష్ణ
- ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై అవగాహన



51వ వార్డులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ కృష్ణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార ఈస్ట్ పార్కులో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో మార్పుల వల్ల ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వ్యాప్తి చెందకుండా వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి ఇంటింటికీ వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని చెప్పారు. వారానికోసారి ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి సహకరించాలని జెడ్సీ కోరారు. కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి సునీల్ కుమార్, ఎస్ఎస్ జనార్దన్, మలేరియా సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలే దోమల ఉత్పత్తి నిలయాలు

మద్దిలపాలెం: నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతున్నాయని, ఎప్పటికప్పుడు ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా విభాగం ఆరోగ్య కార్యకర్త కె.వేణుగోపాల్ సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శివాజీపాలెం పరిధి లక్ష్మీనగర్ కాలనీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వారం పైబడి నిల్వ నీటిలో లార్వా ఉత్పత్తి అయి, దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఆ దోమల కాటు వల్లనే డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాపిస్తాయని చెప్పారు. ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీటి నిల్వలు ఉంటే తొలగించాలని సూచించారు.

క్లుప్తంగా

నాయకుల విగ్రహాలకు ముసుగులు

- ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు



నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కులో ముసుగులు వేసి ఉన్న విగ్రహాలు

సీతమ్మధార: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించడంతో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. నక్కవానిపాలెం ఇందిరా గాంధీ పార్కులోని దివంగత ప్రధాని ఇందిరా గాంధీ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ముసుగులు వేశారు. సత్యం జంక్షన్ ,గురుద్వారా తదితర ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని జీవీఎంసీ అధికారులు స్పష్టం చేశారు.

లలితాదేవికి విశేష పూజలు



శాకంబరి అవతారంలో లలితాదేవి

మురళీనగర్: ఆషాఢ మాసంలో మాస శివ రాత్రి త్రయోదశి సందర్భంగా శుక్రవారం మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు ప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. అమ్మవారిని శాకంబరి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు టీఎస్ రెడ్డి, కార్యదర్శి సనపల వరప్రసాద్, ఇతర సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

బహిరంగ వేలం వాయిదా

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రకటనలో వేలం ఎప్పుడు నిర్వహించేదీ తెలుపుతామని, వివరాలకు జోన్-5 కార్యాలయ పర్యవేక్షకుడిని పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

మెగా జాబ్‌మేళాలో 360 మంది ఎంపిక



అభ్యర్థికి ఎంపిక పత్రం అందిస్తున్న అధికారులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. 8 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 1090 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 523 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 360 మంది ఎంపికైనట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, శాంతి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ కోసం తప్పని నిరీక్షణ



నరేంద్రనగర్‌లో రేషన్ కోసం నిరీక్షిస్తున్న మహిళలు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ కోసం జనం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది. జీవీఎంసీ 43వ వార్డు నరేంద్రనగర్‌లోని గెడ్డ వద్ద స్థానిక మహిళలు రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. రేషన్ బండి అక్కడే ఉన్నా.. ఇచ్చే సిబ్బంది రాకపోవడంతో మహిళలంతా సంచులు పట్టుకుని రోడ్డు పక్కన నిరీక్షిస్తూ కనిపించారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రేషన్ సక్రమంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం గుర్తు తెలియని ఒక యువకుడి మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. వివరాలిలా.. తాటిచెట్లపాలెం 28 బస్‌స్టాప్ దరి సుమారు 32 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉన్నాడు. అటువైపు వెళ్తున్న బ్లూకోట్స్ కానిస్టేబుళ్లు.. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్‌కు సమాచారమిచ్చారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే ఫోర్త్‌టౌన్ సీఐ నంబర్ 94407 96012, స్టేషన్ నంబర్ 08912 710695కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాళ్లు

- అప్పగించిన ద్వారకా పోలీసులు

సీతమ్మధార: గత నెల 29న ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన వృద్ధురాలు పూడి గంగమ్మ అదృశ్యం కేసును పోలీసులు ఛేదించారు. వివరాలిలా.. పూడి గంగమ్మ అనే వృద్ధురాలు అదృశ్యం కావడంతో ద్వారకా పోలీసులు బృందాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, బస్‌స్టాండ్‌లు, రైల్వేస్టేషన్, వృద్ధాశ్రమాల్లో తనిఖీలు చేశారు. పట్టాబిరెడ్డి తోట, కప్పరాడ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేసి అక్కడ గంగమ్మ ఆచూకీ తెలుసుకున్నారు. శుక్రవారం ఆమెను బంధువులకు అప్పగించారు. ద్వారకా పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

- ఈ నెల 1న ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన బెలగాం ఆదమ్మను ఆమె బంధువులకు పోలీసులు అప్పగించారు. వివరాలిలా.. మధురానగర్‌కు చెందిన ఆదమ్మ అనే వృద్ధురాలు గురువారం తప్పిపోయింది. సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో టీమ్‌లు ఏర్పాటు చేసి పలు ప్రాంతాల్లో వెతికారు. సీసీ కెమెరాలతోపాటు సోషల్ మీడియాలో ఫొటోను పోస్ట్ చేశారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ నైట్ బీట్ సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున ఆదమ్మను గుర్తించి ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఆదమ్మను వారు కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు.

తల్లిపాలే పిల్లలకు శ్రేష్టం



రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన పోస్టర్లతో బాలింతలు, గర్భిణులు

ఆరిలోవ: తల్లిపాలు వారోత్సవాలు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ చినగదిలి సెక్టార్ రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు కామేశ్వరి, అన్నపూర్ణ, ఆశా కార్యకర్త చంద్రకళ మాట్లాడుతూ తల్లిపాలే పిల్లలకు శ్రేష్టమైనవని తెలిపారు. పుట్టిన ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలే పట్టాలని సూచించారు. దీని వల్ల పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

మద్దిలపాలెం: ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త ఈర్ల దేవి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. తల్లి పాలు పుట్టిన బిడ్డకు తొలి టీకాలా పని చేస్తుందన్నారు. పుట్టిన గంటలోపు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. సీడీపీవో రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ సెల్వియా పర్యవేక్షణలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రుతుక్రమ సమస్యలపై విద్యార్థినులకు అవగాహన



ఆరోగ్య సూచనలిస్తున్న డాక్టర్ శిరీష

దాబాగార్డెన్స్: కౌమార దశలో విద్యార్థినులు రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని అక్షయ ఐవీఎఫ్ సెంటర్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష సూచించారు. విశాఖ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు శిరీష మాట్లాడుతూ ఇటీవల జీవన విధానాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, వీటి నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ, సీనియర్ లెక్చరర్ ఉదయశ్రీ, మ్యాన్‌కైండ్ ఫార్మా సభ్యులు, అధిక సంఖ్యలో బాలికలు పాల్గొన్నారు.

పార్కు స్థలం పరిశుభ్రం



చెత్త తరలించిన తర్వాత రాజేంద్రనగర్ పార్కు స్థలం

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్ పార్కు స్థలం చెత్తాచెదారంతో నిండి డంపింగ్ యార్డులా రోత పుట్టిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై గత నెల 27న 'నిర్లక్ష్యం నీడలో ప్రభుత్వ స్థలం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. పొక్లెయిన్ సాయంతో సిబ్బంది అక్కడ పేరుకుపోయిన చెత్తను తరలించి, స్థలాన్ని శుభ్రంగా చదును చేశారు. చెత్తాచెదారం పడవేయకుండా శిథిలమైన పార్కు ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్-2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మొత్తం ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఫిషింగ్ హార్బర్‌పై దృష్టి



హార్బర్ సందర్శనలో డీసీపీ-2 ఏసీపీ మోజెస్ పాల్

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌పై పోలీసులు దృష్టి సారించారు. ఇటీవల హార్బర్‌లో నేరాల సంఖ్య, ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. ఈ పరిణామాలను స్వయంగా పరిశీలించేందుకు శుక్రవారం డీసీపీ-2 తుహిన్ సిన్హా హార్బర్‌లో పలు ప్రాంతాలను సందర్శించారు. అక్కడి పరిస్థితులను ఏసీపీ మోజెస్ పాల్ డీసీపీ-2కి వివరించారు. హార్బర్‌లో పెరుగుతున్న ట్రాఫిక్‌కు సంబంధించి తీసుకోవలసిన చర్యలపై డీసీపీ పలు సూచనలు చేశారు. వన్‌టౌన్ సీఐ బి.భాస్కరరావు, ట్రాఫిక్, నేర నియంత్రణ పోలీసులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గాదేవి



పాత రేసపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి గురునాథశర్మ, కమిటీ సభ్యులు ఆ.గురునాథ్ రెడ్డి, బాచి, ఈశ్వరరావు, కోటి, ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– ఫొటో, సాక్షి ఫొటోగ్రాఫర్

చేనేత శారీ వాక్ రేపు



శారీ వాక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ రమేష్ తదితరులు

సీతంపేట: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో చేనేత శారీ వాక్ నిర్వహిస్తున్నట్టు వీ డెంటల్, వీ హెల్త్‌కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ తెలిపారు. శంకరమఠం రోడ్డులోని వీ డెంటల్ కార్యాలయంలో శుక్రవారం ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత వస్త్రాలు ధరించడం వల్ల శరీరానికి సౌకర్యంగా ఉండటంతోపాటు చర్మ వ్యాధులు దరిచేరవన్నారు. బీచ్ రోడ్డులో మూడు కిలోమీటర్లు నిర్వహిస్తున్న శారీ వాక్‌లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని చేనేత వస్త్రాల తయారీదారులకు చేయూత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ప్రతినిధి బీపీఎస్ కల్యాణి, కె.లక్ష్మి, సిహెచ్.పార్వతి, కె.రమ్య, పి.అశోక్, మేరీ, తులసి, రాజ్యలక్ష్మి, ప్రశాంతి, పావని, సీత తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ప్రతినిధులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి మాట్లాడుతూ రానురాను సంక్షేమ కళాశాలల హాస్టళ్లలో సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. విశాఖ జిల్లావ్యాప్తంగా 18 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉండగా దశాబ్దాలు గడుస్తున్నా మూడు హాస్టళ్లకు తప్ప మిగతా వాటికి సొంత భవనాలు లేవని అన్నారు. అలాగే హాస్టళ్లలో సరైన తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులే బయటి నుంచి టిన్నులతో నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధలు పడుతున్నారన్నారు. గతంలో పాత బియ్యం హాస్టళ్లకు సరఫరా చేస్తాం అని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సకాలంలో మెస్ బిల్లులు విడుదల కాక మెనూ అమలు చేయలేమని వార్డెన్లు తెగేసి చెబుతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని హాస్టళ్లలో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్. రుద్రి, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్, లక్ష్మణ్, సతీష్, మధు, లోకేష్, జానకి, హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రవికృష్ణరాజు సేవలు నిరుపమానం



రవికృష్ణరాజును సత్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్, ఇతర అధికారులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన ఇంజనీరుగా నగరానికి ఆదర్శనీయమైన సేవలందించి, అందరి మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేసిన రవికృష్ణరాజు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన రవికృష్ణరాజు సత్కార సభ అధికారులు, ఇంజినీర్లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రవి కృష్ణరాజు మంచి విద్యావంతులని, సానుకూల వైఖరి కలవారని జీవీఎంసీలో ప్రధాన ఇంజనీరుగా మూడేళ్లపాటు విధులు నిర్వహించి ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. మిలాన్, గిరి ప్రదక్షిణ, చందనోత్సవం తదితర ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నగరంలో విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. మున్సిపల్ ఇంజనీర్‌గా పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసి తనదైన ప్రత్యేక ముద్ర వేశారని, జీవీఎంసీలో కూడా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. 36 ఏళ్లగా ప్రభుత్వానికి సేవలందించి ఉద్యోగ విరమణ చేసినందుకు అభినందిస్తూ, శేష జీవితం ఆనందంగా కుటుంబంతో గడపాలని ఆకాంక్షించారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన ఇంజనీర్ రవికృష్ణరాజు నుంచి చాలా నేర్చుకున్నామని, ఎటువంటి సమస్యకైనా ఆయన వద్ద పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం జీవీఎంసీ అధికారులు, ఇంజినీర్లు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.